
సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



క్రీస్తు ప్రాణ త్యాగం పాపుల కోసమే!

లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రై డే. - 8లో



యుద్ధప్రాతిపదికన పునరావాస చర్యలు

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు యుద్ధ ప్రాతిపదికన పునరావాస చర్యలు చేపట్టనున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 271 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	485	552
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 344.12 కిలోలు





న్యూస్‌రీల్

జేసీల బదిలీ


జి.గణేష్‌కుమార్

కడప సిటీ: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల జేసీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. కడపలో జేసీగా పనిచేస్తున్న సీఎం సాయి కాంత్ వర్మను జీవీఎంసీ(వైజాగ్) కమిషనర్‌గా నియమిస్తూ, ఆయన స్థానంలో సీసీఎల్‌ఏ లో జాయింట్ సెక్రటరీగా ఉన్న జి.గణేష్‌కుమార్‌ను నియమించారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గణేష్ కుమార్‌ది కర్నూలు సొంత జిల్లా కాగా, ఆయన రాయచోటిలో బీటెక్ చదివారు.

అన్నమయ్య జిల్లా జేసీగా హిమాన్షు కౌశిక్



అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ గా 2018 బ్యాచ్‌కు చెందిన హిమాన్షు కౌశిక్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడిషనల్ రెసిడెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. జేసీగా ఉన్న తమీమ్ అన్సారియాను తదుపరి పోస్టింగ్ కొరకు రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు.

ఏఎంసీ వైద్య సిబ్బందికి కరోనా

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ)లోని కొంతమంది వైద్యసిబ్బందికి కరోనా పాజిటివ్ రాగా, తక్షణ వైద్యసేవలతో కోలుకుంటున్నారని డాక్టర్ రిచర్డ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గత వారం ఏఎంసీలో కొత్త ప్రాజెక్ట్ ప్రారంభంలో భాగంగా వైద్యసిబ్బందికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. వాటిలో ఏడుగురు వైద్యులు జలుబు, దగ్గుతో బాధపడుతుండగా.. రాపిడ్ టెస్ట్ నిర్వహించి కరోనా పాజిటివ్‌గా గుర్తించారు. దీంతో వారికి తక్షణం వైద్యచికిత్సలు అందించడంతో అందరూ కోలుకున్నారు. కరోనా వ్యాప్తిపై అవగాహన లేకపోవడంతో పలువురు పలురకాలుగా వదంతులు వ్యాప్తి చేస్తున్నారని, ఇందులో భయపడాల్సిన అవసరం లేదని డాక్టర్ స్పష్టం చేశారు.

కోవిడ్ ఐసోలేషన్ వార్డు ప్రారంభం

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో గురువారం కోవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్‌ఎంఓ దివాకర్‌లు ఆస్పత్రిలోని ఐసీయూ కేంద్రంలో 15 పడకలతో ఐసోలేషన్ వార్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్ ఆదేశాలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. ఈ వార్డులో కోవిడ్ మందులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కేసుల సంఖ్య పెరిగితే పడకలు పెంచుతామన్నారు. ఆస్పత్రిలో కరోనా టెస్టింగ్ కిట్‌లు, వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు.

146 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షకు 146 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 146 పరీక్షా కేంద్రాల్లో 27,228 మంది విద్యార్థులకు 27,142 మంది హాజరయ్యారు.

యువ సారథులు!

- అన్నమయ్య జిల్లా ఉన్నతాధికారులంతా యువకులే
- అభివృద్ధితోపాటు ఇతర అంశాలపై తమదైన ముద్ర
- కలెక్టర్, ఎస్పీ, జేసీ, సబ్ కలెక్టర్, అటవీ అధికారుల సేవలు
- సమన్వయం చేసుకుంటూ... సుపరిపాలన అందిస్తూ అడుగులు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా సుపరిపాలనలో యువ అధికారులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. జిల్లాలో ఎక్కువ మంది యువ అధికారులు ఉండగా అందులో ఉన్నత స్థాయి అధికారులు వారే కావడం విశేషం. జిల్లాలో పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్లడంలో వారి పాత్ర కీలకం. అనునిత్యం ఉత్సాహంగా కదులుతూ...కిందిస్థాయి సిబ్బందిని పరుగెత్తిస్తూ పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఒకవైపు అభివృద్ధి...మరోవైపు ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు. అభివృద్ధిలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వేగంగా ముందుకు కదులుతుంటే...రెవెన్యూలో అక్రమాలకు తావు లేకుండా పథకాలను ప్రజలకు చేరవేయడంలో జేసీ తమీమ్ అన్సారియా తమవంతుగా కృషి చేస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా ప్రజలకు పోలీసుశాఖ తరపున సత్వర సేవలు అందించడంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సక్సెస్ అయ్యారు. భూ ఆక్రమణలు జరుగుతున్న సమయంలో రాజంపేట గడ్డపై అడుగుపెట్టిన సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అక్రమాలను నిరోధిస్తూ ప్రజలకు చేరువయ్యారు. అటవీ సంరక్షణలో యువ అధికారి వివేక్ నిమగ్నమయ్యారు. జిల్లాకు సంబంధించి ప్రత్యేకంగా టైగర్, ఎలిఫెంట్ క్యారిడార్‌లను పర్యవేక్షిస్తున్నారు.



ఫలాలు అందరికీ అందేలా..

అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా 2022 ఏప్రిల్ 4న బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు వచ్చిన క్షణం నుంచి ప్రజల గురించి ఆలోచించారు. పథకాలు ప్రజలకు అందేలా విశేష కృషి చేశారు. అంతేకాకుండా రెవెన్యూశాఖలో అవినీతికి ఆస్కారం లేకుండా అధికారులను ముందుకు నడిపించారు. పలు ప్రాజెక్టులకు భూ సేకరణ వేగవంతంగా చేయించడంతోపాటు రేషన్ సరుకులు ప్రజలకు సక్రమంగా అందేలా ప్రత్యేక కృషి చేశారు. జిల్లాలో అభివృద్ధికి సంబంధించి స్థలాల పరిశీలన మొదలుకొని ఇతరత్రా అన్ని పనుల్లో వేగంగా అడుగులు వేశారు. యువ జాయింట్ కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా గుర్తింపు పొందారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రత్యేకత

అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత తొలి ఎస్పీగా వి.హర్షవర్ధన్‌రాజు 2022, ఏప్రిల్ 3న బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు శాంతి భద్రతల పరంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అసాంఘిక, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిన్నపాటి ఘటన కూడా లేకుండా చరిత్ర సృష్టించారు. మరోవైపు నిజాయితీ అధికారిగా పేరు తెచ్చుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం అందేలా కృషి చేస్తున్నారు. ఈ యువ ఐపీఎస్ జిల్లాలో ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.

అటవీ సంరక్షణలో..

అన్నమయ్య జిల్లా అటవీశాఖాధికారి వివేక్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఎర్రచందనం పరిరక్షణ ధ్యేయంగా ముందుకు వెళుతున్నారు. ఈయన తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారు. పోలీసు కుటుంబం నుంచి వచ్చిన ఈయన ఇండియన్ ఫారెస్టు సర్వీసు 2019 బ్యాచ్‌లో అటవీ శాఖాధికారిగా ఎంపికయ్యారు. తొలిసారిగా కడప సబ్ డీఎఫ్ఓగా పనిచేశారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా అన్నమయ్య జిల్లాకు అటవీ శాఖాధికారిగా నియమితులయ్యారు.

సబ్ కలెక్టర్‌గా సేవలందిస్తూ..

ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. తొలి పోస్టింగ్ సబ్ కలెక్టర్ అండ్ పీఓ ఐటీడీఏ, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా. ఈయన స్వరాష్ట్రం హర్యానా టాప్ (258) ర్యాంకుతో ఐఏఎస్‌ను సాధించారు. ఐటీడీఏ విభాగంలో తనదైన శైలిలో సేవలందించారు.

తనదైనముద్ర

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ యువ అధికారిగా 2022 ఏప్రిల్ 4న అన్నమయ్య జిల్లాలో విధుల్లో చేరారు. 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లా ఏర్పడిన తర్వాత తొలి కలెక్టర్‌గా ఏడాది కాలం పూర్తి చేసుకున్నారు. మొదట్లో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగా ఉన్న సమయంలోనూ కలెక్టర్ గిరీషా తనదైన ముద్ర వేస్తూ సౌకర్యాలను వేగవంతంగా అందించడంలో సఫలీకృతులయ్యారు. అంతేకాకుండా కొత్త జిల్లాలో పాలనను గాడిలో పెట్టడంతోపాటు జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారు. రాష్ట్రంలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. పథకాల అమలులో రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లాను ముందు వరుసలో నిలబెడుతూ వస్తున్నారు.

నిర్దిష్ట కాలపరిమితిలో సంక్షేమ పథకాల లక్ష్యాలు పూర్తి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను నిర్దేశించిన కాల పరిమితిలోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం విజయవాడలోని ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. ఇందులో రెవెన్యూ అంశాలలో భాగంగా రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనం, అనుబంధ రంగాలు, గృహ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేఅవుట్ల వారీగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణ ప్రగతి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, వేసవికాలం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై జిల్లాల వారిగా కలెక్టర్లతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులకు భూసేకరణ పూర్తి చేసిన వాటికి 3జీ అవార్డ్స్ పాస్ చేసి, లబ్ధిదారులకు వేగవంతంగా పరిహారం పంపిణీ చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఇందుకు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మే 10లోగా హద్దురాళ్లు నాటాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రీసర్వేలో భాగంగా మే నెల 10లోగా హద్దురాళ్లు నాటే ప్రక్రియ పూర్తి కావాలని ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టర్ బంగ్లా నుంచి రీసర్వే హద్దురాళ్లు నాటే ప్రక్రియ పురోగతిపై ఆయన వర్చువల్ విధానంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొదటి దశలో 84 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇందులో అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ రాళ్లు నాటడం అన్నారు. జిల్లాలో 57,040 రాళ్లు నాటాల్సి ఉందన్నారు. హద్దురాళ్లు నాటే ప్రక్రియలో ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ప్రతి రోజు లక్ష్యానికి చేరువ కాకుండా పెండింగ్ పెట్టుకుంటే వేటు తప్పదని కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రీసర్వేలో మొదటి దశలో పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్లు నాటేందుకు 52 టీంలను ఏర్పాటు చేశామన్నారు.

వైభవం.. గంధోత్సవం


గంధం సామగ్రిని తీసుకెళ్తున్న భక్తులు

కమలాపురం: కమలాపురంలో పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, హజరత్ దస్తగిర్ షా ఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వీ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల గంధోత్సవం వైభవంగా జరిగింది. దర్గా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్-ఏ-నషీన్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో గురువారం అర్ధరాత్రి గంధోత్సవం అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి గంధం సామగ్రిని బస్టాండు సమీపంలోని గంధం ఇంటికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో ఊరేగించారు. ఊరేగింపులో తమిళనాడు నుంచి ప్రత్యేకంగా తయారు చేసి తీసుకొచ్చిన బాణా సంచా పేల్చారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన డప్పు వాయిద్యాల నడుమ యువత వివిధ రకాల నృత్యాలు చేస్తూ స్వామి పట్ల ఉన్న భక్తిని ప్రదర్శించారు. పీఠాధిపతి దర్గాలోని స్వామి వార్ల మజార్లపై పూల చాదర్ సమర్పించి గంధం ఎక్కించారు. అనంతరం భక్తులందరికి పంచి పెట్టారు. గంధోత్సవం ఊరేగింపులో ఫకీర్లు చేసిన విన్యాసాలు అలరించాయి.ఉరుసు సందర్భంగా దర్గా మైదానంలో ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పోటీ అలరించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఉస్తాద్ సలీం ఝన్‌కార్, సర్ఫరాజ్ చిష్టిల మధ్య రాత్రంతా ఖవ్వాలీ పోటీ సాగింది. గఫార్ షా ఖాద్రి, జహీరుద్దీన్ షా ఖాద్రి స్వాముల వారి పై పాడిన ఖవ్వాలి పాటలను వినేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా ఉరుసుకు తరలివచ్చారు. స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు.


విద్యుద్దీపాలంకరణలో కమలాపురం దర్గా

జనం తరలె.. రథం కదిలె


ఒంటిమిట్ట కోదండ రామయ్య రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

- మార్మోగిన రామ నామస్మరణ
- ఏకశిలానగరి..భక్తజనఝరి

ఒంటిమిట్ట: అశేష భక్తుల రామ నామస్మరణ, మంగళవాయిద్యాలు, చెక్కభజనల మధ్య ఒంటిమిట్ట కోదండ రామయ్య రథోత్సవం రమణీయంగా సాగింది.గురువారం రంగురంగు పూలతో అలంకరించిన రథంలో సీతారాములు ఆశీనులై భక్తులను అనుగ్రహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఏకశిలానగరి..భక్తజన సంద్రంగా మారింది. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ పురుషోత్తమరాజు, ఎస్‌ఐ మధుసూదన్‌రావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు స్వామివారు కాళీయమర్ధన అలంకారంలో భక్తులను అనుగ్రహిస్తాడు. రాత్రి 7 గంటలకు అశ్వవాహనసేవ జరగుతుంది.


రథోత్సవాన్ని సెల్‌లో చిత్రీకరిస్తున్న భక్తురాలు


పరిమళించిన పద్మాలు


దూదేకుల ఖాదర్‌వలీ

కడప సెవెన్‌రోడ్స్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మరో పద్మం వికసించింది. జిల్లా కీర్తి కిరీటంలో ఇంకో కలికి తురాయి వచ్చి చేరింది. సిరిధాన్యాల రాయబారిగా, మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఖ్యాతి గడించిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ దూదేకుల ఖాదర్‌వలీ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో సత్కరించి గౌరవించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా బుధవారం కర్ణాటక రాష్ట్రం తరుపున పద్మ పురస్కారాలు అందుకున్న ఖాదర్‌వలీ ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన వారు కావడం జిల్లాకు గర్వకారణం.

- ఖాదర్‌వలీ విద్యాభ్యాసం మైసూరు, బెంగళూరులో సాగింది. తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. అక్కడ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి చాలాకాలం పనిచేశారు. తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి కలుషితమై సమాజం అనారోగ్యంగా మారుతుండడం ఆయనను కదిలించింది. అంతే...అమెరికన్ డాలర్లను కాదనుకుని మైసూరు వచ్చేశారు. చాలా కాలంగా మనం వదిలేసిన రాగి, కొర్ర, అరికె, సామలు, ఊదర్ల వంటి చిరు ధాన్యాల్లోని సంప్రదాయ ఆరోగ్య రహస్యాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రారంభించారు. గత 20 సంవత్సరాలుగా సిరి ధాన్యాల వినియోగం, ఉపయోగాల గురించి ప్రజల్లో విస్తృత చైతన్య కార్యక్రమాలు ఆయన నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆయన పేరు తెలియని వారు దాదాపు ఉండరనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంలోనే ఆయనకు పద్మ అవార్డు లభించడం విశేషం. జిల్లా వాసికి పద్మ పురస్కారం లభించడం ఇదే ప్రథమం కాదు.

సాహితీ పద్మం 'పుట్టపర్తి'వారు


పుట్టపర్తి నారాయణాచార్యులు

జిల్లా సాహితీ వనంలో వికసించిన పద్మం సరస్వతీపుత్ర డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు.ప్రొద్దుటూరులో ఉపాధ్యాయుడిగా కొంతకాలంగా పనిచేశారు. ఆయన ప్రఖ్యాత గ్రంథమైన 'శివ తాండవం'రచించింది అక్కడి శివాలయంలోనే. ఆయన ప్రతిభా పాటవాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది.

'యామిని'కి పద్మభూషణం


యామిని కృష్ణమూర్తి

సుప్రసిద్ధ కూచిపూడి, భరత నాట్య కళాకారిణి యామిని కృష్ణమూర్తి అన్నమయ్య జిల్లా సంబేపల్లెకు చెందిన వారు. అయినప్పటికీ బాల్యం నుంచే ఆమె మదనపల్లెలో పెరిగారు. తిరుమల–తిరుపతి దేవస్థానం అస్థాన నర్తకిగా ఆమె పనిచేశారు. ఆమె సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మవిభూషణ్ వంటి పురస్కారాలు అందజేసి గౌరవించింది.

క్లుప్తంగా

మహిళలపై దాడి

కలకడ : మహిళలపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలక్రిష్ణుడు తెలిపారు. గురువారం మండలంలోని గంగాపురం గ్రామానికి చెందిన కె.వెంకటరమణ భార్య జయమ్మ వారి పిల్లలపై అదే గ్రామానికి చెందిన కోట శ్రీనివాసులునాయుడు, చంద్రయ్యనాయుడు, రామచంద్రనాయుడు దాడికి దిగారు. తాము గొర్లు తోలుకుని అడవికి వెళ్లరాదని అడ్డుపడి దాడి చేసి, దుర్భాషలాడారని బాధితురాలు జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు.

మాజీ సైనికుడి ఇంట్లో మద్యం స్వాధీనం

మదనపల్లె : మాజీ సైనికుడి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన మిలిటరీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సుధాకర్ తెలిపారు. మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిపల్లెకు చెందిన మాజీ సైనికుడు పూలప్రసాద్ ఇంట్లో మిలిటరీ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని పేర్కొన్నారు. తనిఖీల్లో రూ.60 వేలు విలువ చేసే 39 మిలిటరీ బాటిల్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని సీఐ వివరించారు.

రాజంపేటలో గుర్తుతెలియని మృతదేహం



రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని రేణిగుంట జీఆర్పీ ఎస్ఐ అనిల్ గురువారం తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ఏరియా హాస్పిటల్‌లోని మార్చురీ రూంలో ఉంచామని ఆయన పేర్కొన్నారు. మృతదేహం వివరాల కోసం ఆరా తీస్తున్నామన్నారు. మృతుడి వయసు 45 ఏళ్లు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు 8919662969 అనే ఫోన్ నంబరకు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్రీస్తు ప్రాణ త్యాగం పాపుల కోసమే!


- నేడు గుడ్‌ఫ్రైడే
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

రాజంపేట టౌన్/కడప కల్చరల్ : క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు గుర్తుకు వస్తాయి. లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రై డే. దీన్నే శుభశుక్రవారం అని కూడా అంటారు. తన ఆత్మ బలిదానంతో పాపులకు దేవుని పరిశుద్ధ సన్నిధిలో స్థానం కల్పించిన ఈ శుక్రవారాన్ని ప్రపంచంలోని క్రైస్తవులందరూ శుభ శుక్రవారంగా భావిస్తారు. దయామయుడైన క్రీస్తు శిలువపై చిందించిన రక్తం మానవాళికి శుభాలను సమకూర్చింది గనుక దీనిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారు. ఈ శుక్రవారం నాడే కల్వరిగిరిపై క్రీస్తును శిలువపై శిక్షించారు.

జిల్లాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకునేందుకు క్రైస్తవులు, విశ్వాసులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అందులో భాగంగా పాస్టర్లు చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ముగిసిన లెంట్‌డేస్

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవ లోకం 40 రోజులపాటు లెంట్‌డేస్ (శోక దినాలు) నిర్వహిస్తోంది. ఈ



శిలువపై బలియాగమైన ఏసుప్రభువు

సమయంలో క్రైస్తవులు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించలేదు. నిరంతరం దైవ ధ్యానంలోనే గడిపారు. పొరపాటున కూడా చెడు పనులకు పాల్పడకుండా జాగ్రత్త పడతారు. కనీసం నూతన దుస్తులు కూడా ధరించరు. చర్చిలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా మౌనంగా ప్రార్థనలు నిర్వహించారు. మట్టల ఆదివారం నాటితో లెంట్‌డేస్ ముగిశాయి. శుభ శుక్రవారాన్ని, ఆ తర్వాత పునరుత్థానం సందర్భంగా ఆదివారం పండుగను నిర్వహించుకునేందుకు క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పునరుత్థానమే ఈస్టర్

కల్వరి కొండమీద శిలువపై మరణించిన క్రీస్తును అక్కడి కొండ గుహలో సమాధి చేశారు. మూడవ రోజు ఆదివారం ఆయన పునరుత్థానం పొంది తిరిగి తన శిష్యులకు దర్శనమిచ్చాడు. 'నేను జీవమును' అన్న మాటకు నిదర్శనంగా నిలిచి లోకానికి తన దివ్య మహిమను చాటాడు. ఆయన పునరుత్థానం చెందిన ఆదివారాన్నే ఈస్టర్ సండేగా వ్యవహరిస్తారు. అశాంతితో తల్లడిల్లుతున్న నేటి ప్రపంచానికి క్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, కరుణ, క్షమ గుణాలు ఆదర్శం కావాలని ఆశిద్దాం! ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని చర్చిలలో క్రీస్తు ఆత్మబలిదానం, శిలువ యాగం తదితర ఘట్టాలను ప్రదర్శిస్తారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. కల్వరిగిరిపై బలిదానం చేసిన ఘట్టాలను గురువులు వివరిస్తారు.

మహోన్నతమైన రోజు



మానవుల పాప నివారణ కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజే గుడ్‌ఫ్రైడే. ఇది మానవులందరికీ ఓ మహోన్నతమైన రోజు. ఏసు క్రీస్తునందు విశ్వాసం ఉంచిన వారు పాపముల నుంచి విముక్తి పొంది నిత్యజీవము పొందెదరు.

- కరుణాకర్, పాస్టర్, లూథరన్ చర్చి, రాజంపేట

యుద్ధప్రాతిపదికన పునరావాస చర్యలు

కురబలకోట : రూ. 759 కోట్లతో చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు యుద్ధ ప్రాతిపదికన పునరావాస చర్యలు చేపట్టినట్లు హంద్రీనీవా యూనిట్–2 పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ, తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు అన్నారు. గురువారం రిజర్వాయర్ వద్ద రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించారు. ఇంటి స్థలాల కేటాయింపుపై చర్చించారు. కడప క్రాస్ సమీపంలో తానా మిట్ట దగ్గర ఎంఐజీ లేఅవుట్ పక్కన 25 ఎకరాలకు పైగా సువిశాల స్థలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. హైవే పక్కన అదీ మేలైన స్థలాన్ని అందరికీ ఒకే చోట ఎంపిక చేయడం పట్ల నిర్వాసితులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. సకల సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ప్రతి కుటుంబానికి 5 సెంట్ల స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద పక్కా



ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వాసితుల గ్రామ సభలో అధికారులు

ఇళ్లు కట్టించడం జరుగుతుందన్నారు. ఆ కుటుంబంలో 18 ఏళ్లు పైబడిన వారుంటే వారికి కూడా ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటి స్థలం అవసరం లేనట్లయితే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా తగిన ఆర్థిక సహకారం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుగుణ, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వో జయరామిరెడ్డి, పీఆర్వో కులదీప్‌రెడ్డి, వీఆర్ఏ కవిత పాల్గొన్నారు.

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మోటారువీధికి చెందిన కె.మురళీ(55) కుటుంబ సమస్యలతో గురువారం ఉదయం ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. ఆస్పత్రి అవుట్‌పోస్ట్ సిబ్బంది చౌడేపల్లె పోలీసులకు సమాచారం అందించారు. పెద్దమండ్యం మండలం బండ్రేవు పంచాయతీ కేతిరెడ్డిగారిపల్లెకు చెందిన రమణమ్మ(30) కుటుంబ సమస్యలతో గురువారం ఇంట్లోనే గడ్డికి పిచికారీ చేసే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పెద్దమండ్యం పోలీసులు విచారణ చేస్తున్నారు. రామసముద్రం మండలం పురాండ్లపల్లెకు చెందిన రామచంద్ర(49) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో తిరుపతిలో వైద్య చికిత్సలు పొందాడు. అయితే గురువారం తన అనారోగ్యంపై మనస్తాపం చెంది విషపు గుళికలు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సిమెంటు లారీ బోల్తా

నిమ్మనపల్లె : సిమెంటు లోడుతో వస్తున్న లారీ బోల్తా పడి డ్రైవర్ గాయపడిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి అల్ట్రాటెక్ సిమెంటు లోడుతో నిమ్మనపల్లెలో జైన్ ట్రేడర్స్‌కు లోడు తీసుకొస్తూ బోల్తా పడింది. మండలంలోని మదనపల్లె – నిమ్మనపల్లె మెయిన్ రోడ్డులోని ముస్టూరు క్రాస్ వద్ద మలుపులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చింటుబాబు గాయపడ్డాడు. స్థానికులు బాధితుని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. సిమెంటు బస్తాలను ఇతర వాహనాల్లో నిమ్మనపల్లెకు రవాణా చేశారు.

బావిలో గల్లంతైన యువకుడి మృతి

లక్కిరెడ్డిపల్లి : బావి నీటిలో బుధవారం గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గురువారం బయటకు తీశారు. మండల పరిధి కాకులవరం సమీపంలోని ఓ బావిలో ఈత కొట్టేందుకు రాయచోటి మంగళ కాలనీకి చెందిన ఐదుగురు యువకులు బుధవారం వచ్చారు. వీరు మద్యం సేవించి బావిలో ఈత కొడుతుండగా తిరుపతి దేవేంద్ర (17) అనే యువకుడు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ వినోద్ కుమార్ తమ సిబ్బందితోపాటు లక్కిరెడ్డిపల్లి అగ్నిమాపక సిబ్బంది రాత్రంతా బావిలో గాలించారు. మృతి చెందిన యువకున్ని గురువారం ఉదయం బయటకు తీశారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

ఎట్టకేలకు బయటపడ్డ మృతదేహం

నిమ్మనపల్లె : ఈతకు వెళ్లి నీటి కుంటలో మృతి చెందిన సుధాకర్ (35) మృతదేహం ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం బయటపడింది. పెద్దమాదిగపల్లెకు చెందిన టి.సుధాకర్ మంగళవారం దామర ఒడ్డు నీటికుంటలో ఈదుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. అప్పటి నుంచి అగ్నిమాపక సిబ్బంది, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా రెండు రోజులపాటు మృతదేహం జాడ తెలియలేదు. దీంతో గురువారం అదనపు బలగాలను రప్పించి మృతదేహాన్ని వెతికారు. తహసీల్దార్ సీఆర్.మంజుల, ఇన్‌చార్జి ఎస్ఐ.రవీంద్రబాబు, ముదివేడు ఎస్ఐ సుకుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా గాలించడంతోపాటు నీటి కుంట నుంచి నీటిని ఐదు అడుగుల మేర బయటకు తోడారు. అనంతరం మధ్యాహ్నానికి మృతదేహం ఆచూకీ లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


యువతి అదృశ్యం

సంబేపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షరీఫ్ గురువారం తెలిపారు. రౌతుకుంట పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన యువతి బుధవారం రాత్రి నుంచి అదృశ్యం అయిందని యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం కోసం ఘర్షణ

కలకడ : స్థలం కోసం జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని గుడిబండ పంచాయతీ యల్లంగుడిబండ గ్రామానికి చెందిన బుడ్డన్న కుమారుడు సాంబశివ, అదే గ్రామానికి చెందిన వీరనాగమ్మ గురువారం గొడవ పడ్డారు. ఈ క్రమంలో సాంబశివను వీరనాగమ్మ కొడవలితో నరికి గాయపరిచింది. గాయపడ్డ సాంబశివను 108 సిబ్బంది ఇయంటి వెంకటాచలపతి, పైలెట్ శ్రీనివాసులు చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆసరాలో సరదాగా తాడాట



తాడు లాగుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లెలో గురువారం ఏర్పాటు చేసిన ఆసరా కార్యక్రమంలో తాడాట విశేషంగా ఆకట్టుకుంది. మధ్యలో ఓ గీత గీయించి మహిళలు– పురుషులు ఈ తాడును సమానంగా పట్టుకొని లాగడం మొదలు పెట్టారు. మూడు నిమిషాలలో ఆ తాడు ఎటువైపు వస్తుందో వారు గెలిచినట్లు. అయితే మూడు రౌండ్లలో మహిళలు రెండు రౌండ్లు గెలిచారు. దీంతో మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ ఆసరా తాడు ఆటతో సరదాగా సాగింది. **– సంబేపల్లె**

సౌమ్యనాథస్వామి సేవలో హైకోర్టు జడ్జి

రాజంపేట : నందలూరులోని సౌమ్యనాథాలయాన్ని హైకోర్టు జడ్జి బి.కృష్ణమోహన్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తరువాత పద కవితా పితామహుడు అన్నమాచార్యులు జన్మస్థలం అయిన తాళ్లపాకను సందర్శించారు. అక్కడ శ్రీ సిద్దేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాలు, అన్నమయ్య ధ్యానమందిరం దర్శించుకున్నారు. ఈయనతోపాటు రాజంపేట మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ, జడ్జిలు సంధ్యారాణి, లత, రాజంపేట డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సన్మానించిన న్యాయవాదులు

హైకోర్టు జడ్జి రాజంపేటకు వచ్చిన సందర్భంగా స్థానిక రోడ్లు భవనాల అతిథి గృహంలో రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఆనంద్‌కుమార్, కోశాధికారి సురేష్‌రాజు, సభ్యులు కందుల వెంకటరమణ, రమణ, బసినేని రమేష్, నాసరుద్దీన్ తదితరులు కలిసి సన్మానించారు. రాజంపేట కోర్టుకు సంబంధించిన సమస్యలను హైకోర్టు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు.



హైకోర్టు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న టీటీడీ అధికారులు

ఘనంగా శ్రీమారుతి హాస్పిటల్స్ ప్రారంభం

తిరుపతి కల్చరల్ : ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన అత్యాధునిక సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమారుతి 100 పడకల హాస్పిటల్స్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. సినీ హీరోలు డాక్టర్ మోహన్ బాబు, మంచు విష్ణు, మంచు మనోజ్, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ బాబు మాట్లాడుతూ 9 ఏళ్లుగా అతి తక్కువ ఖర్చుతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న శ్రీమారుతి హాస్పిటల్స్ మరో అడుగు ముందుకు వేసి సరికొత్త టెక్నాలజీతో నూతనంగా శ్రీమారుతి హాస్పిటల్స్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ తిరుపతి, రాయలసీమ ప్రజలకు గుండెకు సంబంధించిన అత్యాధునిక కేథలాబ్‌ను అందుబాటులోకి తీసుకురావడమేకాక.. నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో అన్ని విభాగాలను ఒక్క చోట ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ ఊపిరితిత్తులలో ఉన్న చీము గడ్డలు, నెమ్ము గడ్డలను తొలగించి ఊపిరితిత్తులకు స్టంట్ కూడా వేసే అత్యాధునిక పరికరాలు హాస్పిటల్లో ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా ఇంటర్వెన్షనల్ పల్మనాలజీలో బ్రాంకోస్కోపి ద్వారా ఆధునిక ఊపిరితిత్తుల చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, బర్డ్ హాస్పిటల్ మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ దగ్గుపాటి శ్రీహరిరావు,హాస్పిటల్ డైరెక్టర్ ఎం.రామక్రిష్ణమనాయుడు, కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మేనేజర్ దామోదరం, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీమారుతి హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న సినీ నటుడు మోహన్‌బాబు

మార్కెట్‌యార్డులో ఆక్రమణల తొలగింపు

గుర్రంకొండ : గుర్రంకొండలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. యార్డుకు రోజూ వేలాది మంది రైతులు టమాటలను తీసుకొస్తుంటారు. దీంతో పలువురు అక్రమార్కుల కన్ను ఖాళీ స్థలాలపై పడింది. కొంత మంది మార్కెట్ రక్షణ గోడ, ప్రవేశ ద్వారానికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించుకున్నారు. వీటిలో రేకుల షెడ్లు, బంకులు ఏర్పాటు చేసుకొన్నారు. పలువురు వీటిని ప్రయివేట్ వ్యక్తులకు అద్దెలకు ఇచ్చుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, కార్యదర్శి జగదీష్‌లు జేసీబీలు తీసుకొచ్చి ఆక్రమణలు తొలగించే పనిచేపట్టారు. ప్రహరీ, యార్డులోపల ఉన్న బంకులను, రేకుల షెడ్డులను తొలగించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రమణ, సుబ్రమణ్యం, నయిమ్‌లు పాల్గొన్నారు.



బంకును జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

రాయచోటి అర్బన్ : భారత ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ద్వారా నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి ఐసీడీఎస్ సీడీపీఓ శశికళ కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు రక్షణ, సంరక్షణ అవసరమైన కుటుంబాలకు చెందిన పిల్లలు దరఖాస్తుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అర్హులైతే వారికి మిషన్ వాత్సల్య స్పాన్సర్షిప్ కింద ఒకొక్కరికి రూ.4 వేల చొప్పున సాయం అందుతుందన్నారు. తల్లి వితంతువు, కుటుంబం విడిచి పెట్టిన పిల్లలు, అనాథపిల్లలు, ప్రాణాంతక వ్యాధికి గురైన వారి పిల్లలు, శారీరకంగా అసమర్థులు, ఆర్థిక పరిస్థితి పూర్తిగా సరిగా లేని వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హులైన వారు సమీప వార్డు, గ్రామ సచివాలయం పోలీసును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న సీడీపీఓ శశికళ

15న మెగా జాబ్ మేళా

రాజంపేట రూరల్ : నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికే ఈ నెల 15వ తేదీన మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు తెలియజేశారు. స్థానిక సబ్ కలెక్టర్ సభా భవనంలో సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 9 గంటలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, క్యూస్ కార్ప్ ఆధ్వర్యంలో 15వ తేది మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని నిరుద్యోగులు హాజరై ఉద్యోగాలు పొందాలని కోరారు. విప్రో, గూగుల్, ఫ్లిప్ కార్టు, హెటేరో డ్రగ్స్, జెస్ట్ డైల్, అరబిందో ఫార్మా, బైజూస్, కియా మోటార్స్, ముత్తూట్ ఫైనాన్స్, క్యూస్ కార్ప్, గ్రీన్ టెక్, మెడి అసిస్టెంట్, అలెస్ టెక్నాలజీ, అపోలో ఫార్మశీ, ఐఎస్ఓఎన్ సొల్యూషన్స్, ఆయిల్ డెక్సోన్, డెల్లో యుతేలతోపాటు 80 బహుళజాతి కంపెనీలు పాల్గొనున్నాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులు పాల్గొనాలన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. సెలక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ. 50 వేల వరకు జీతం ఉంటుందన్నారు. విద్యార్హత పత్రాలు, జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. పాల్గొనే అభ్యర్థులకు మధ్యాహ్నం భోజన సదుపాయంతోపాటు వివిధ మండలాల నుంచి వచ్చే వారికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. పూర్తి వివరాలకు 9740212687,9885797909,9491475836 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, ఎంఆర్‌ఓలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కమిషనర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

తాళం వేసిన ఇంట్లో చోరీ

మదనపల్లె : తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.1.75 లక్షల విలువచేసే బంగారు నగలు, నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన మదనపల్లెలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు...

తాళ్లసుబ్బన్న వీధికి చెందిన మహమ్మద్ హుస్సేన్ కుమారుడు ఎస్.కే.అస్లాం త్యాగరాయవీధిలో చిల్లరదుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. బుధవారం సాయంత్రం రంజాన్ ఉపవాసదీక్ష ముగించేందుకు ఎన్వీఆర్ లేఅవుట్లోని బంధువుల ఇంటికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. రాత్రి అక్కడే ఉన్నారు. అయితే రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తలుపులు పగులగొట్టి 50 గ్రాముల బంగారునగలు, 250 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు అపహరించుకుని వెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన అస్లాం కుటుంబసభ్యులు.. తలుపులు పగులగొట్టి ఉండటం, బీరువా తెరచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. ఎస్.కే.అస్లాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.